వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దాం

- 'ఉత్తర' ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు
- పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం



47వ వార్డులో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కె.కె.రాజు



14వ వార్డులో పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

సీతమ్మధార: రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు పిలుపునిచ్చారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ ఉత్తర కార్యాలయంలో 14వ వార్డు శ్రేణులతో కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు అధ్యక్షతన శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ శ్రేణులకు పలు సూచనలిచ్చారు. కె.కె.రాజును గెలిపించుకుంటామని పార్టీ శ్రేణులు హామీ ఇచ్చారు. ఈ సారి ఉత్తర నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వీకేపీసీపీఐఆర్ చైర్మన్, ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, బల్ల శ్రీను, కోడూరి సత్యనారాయణ, కె.సుశీల, వార్డు సీనియర్ నాయకులు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు, గృహసారథులు పాల్గొన్నారు.

కె.కె.రాజు గెలుపునకు కృషి

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు బాపూజీనగర్ గాయత్రి ఫంక్షన్ హాల్‌లో కార్పొరేటర్ కె.కామేశ్వరి ఆధ్వర్యంలో శుక్రవారం పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ చూపారన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో విజయ కేతనం ఎగురవేసి రెట్టింపు ఉత్సాహంతో తిరిగి ప్రజా సంక్షేమాన్ని కొనసాగిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కె.కె.రాజు గెలుపునకు కృషి చేస్తామని వార్డు నాయకులు, కార్యకర్తలు హామీ ఇచ్చారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని ప్రజలను కె.కె.రాజు అభ్యర్థించారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు, పార్టీ సీనియర్ నాయకుడు కర్రి రామారెడ్డి, అప్పారావు, మహిళా నాయకురాలు పద్మావతి, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు, గ్రామపెద్దలు గృహసారథులు పాల్గొన్నారు.

వ్యూహాత్మకంగా అడుగులు వేయాలి



రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావును సత్కరిస్తున్న కె.కె.రాజు, అనిల్‌కుమార్‌రాజు

సీతమ్మధార: సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా వ్యూహాత్మకంగా అడుగులు వేయాలని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు సూచించారు. శుక్రవారం పార్టీ ఉత్తర కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజును ఆయన మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో జాగ్రత్తగా వ్యవహరించాలని కె.కె.రాజుకు సూచించారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ప్రత్యర్థుల విమర్శలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో మమేకమై కార్యకర్తలను సమన్వయపరుస్తూ ముందుకు సాగాలన్నారు. ఎన్నికల ప్రచారంలో తాను నేరుగా పాల్గొంటానని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం ఎంపీ గొల్ల బాబూరావును కె.కె.రాజు, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కిరణ్‌రాజు, అంబటి శైలేష్, వాక శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన



ధర్మానగర్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుకు దీవెనలు అందిస్తున్న వృద్ధురాలు



తిక్కవానిపాలెంలో బెడ్ పేషెంట్ ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకుంటున్న కె.కె.రాజు

- 'ఉత్తర' ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు
- 55వ వార్డులో మార్నింగ్ వాక్

కంచరపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పాలన సాధ్యమని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం జోగారావునగర్, యల్లబిల్లివారి వీధి, తిక్కవానిపాలెం, ధర్మానగర్ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం ఆయన మార్నింగ్ వాక్ నిర్వహించారు. స్థానికులతో మాట్లాడి వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ముందుగా జోగారావునగర్‌లో నూకాంబికా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పాలనలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పేద, మధ్యతరగతి ప్రజలకు బాసటగా నిలిచారన్నారు. వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రాగానే రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు సుపరిపాలన అందిస్తామని చెప్పారు. అనంతరం ధర్మానగర్, తిక్కవానిపాలెం ప్రాంతాల్లో పలువురు బెడ్ పేషెంట్లను ఆయన పలకరించి ఆర్థిక, ఆరోగ్య భరోసా ఇచ్చారు. మార్నింగ్ వాక్‌లో పలువురు వృద్ధులు కె.కె.రాజుకు ఎన్నికల్లో గెలవాలని విజయానికి దీవెలను అందించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కె.శశికళ, పార్టీ వార్డు అధ్యక్షుడు కాయిత పైడి రత్నాకర్ యాదవ్, దుప్పలపూడి శ్రీను, బొడ్డేటి గంగామహేష్, యడ్ల సిద్ధార్థరాజు, సాండి సురేష్, వై.రాజు, ఎస్.రెడ్డి, జామి దాస్, పోలా రాజు, జోగి సతీష్, జామి కరుణ, లక్ష్మి, డైరెక్టర్ రాయుడు, యువజన విభాగం నాయకులు అంబటి శైలేష్, ఎం.సునీల్, సమ్మెట్ల వెంకటేష్, భోగవల్లి గోవిందు, సురెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఓటు హక్కును వినియోగించుకోండి

సీతమ్మధార: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకుని, ఓటింగ్ శాతాన్ని పెంచాలని ఉత్తర నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ శ్రీరామ్మూర్తి ఒక ప్రకటనలో కోరారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఉత్తర నియోజకవర్గంలోని 272 పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ లెవెల్ అధికారులు(బీఎల్‌వో), సూపర్‌వైజర్లు ఈ నెల 31వ తేదీ ఆదివారం ప్రజలకు ఓటు నమోదైన సంఖ్య, పోలింగ్ కేంద్రాల చిరునామా వివరాలను తెలియజేస్తారన్నారు. ఉత్తర నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తప్పిన ప్రమాదం

మర్రిపాలెం: ఆగి ఉన్న ఓ లారీని మరో లారీ వెనుక నుంచి ఢీకొన్న ఘటన కంచరపాలెం ఐదో పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజాము సుమారు 2 గంటల సమయంలో రోడ్డు ప్రమాదం సంభవించినట్టు పోలీసులు తెలిపారు. వివరాలిలా.. బిర్లా జంక్షన్ వద్ద హైవేపై ఆగి ఉన్న ఓ లారీని తాటిచెట్లపాలెం నుంచి బిర్లా వైపు వస్తున్న మరోలారీ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

తూనిక యంత్రాల పరిశీలన



రైతుబజార్‌లో తూనిక యంత్రాన్ని పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ రామారావు

సీతంపేట: నరసింహనగర్ రైతుబజార్‌లో శుక్రవారం ఉదయం తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ వి.రామారావు అధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. కాటాలకు సీళ్లు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. ఆరు కాటాలకు సీళ్లు లేనట్టు గుర్తించి వాటికి సీళ్లు వేశారు. వినియోజదారులకు తూకంలో తేడా ఉన్నట్టు అనుమానాలు ఉంటే ధర్మకాటాలో తూకం వేసి సరిచూసుకోవాలని తెలిపారు. వినియోగదారులు తాము కొనుగోలు చేసిన కూరగాయలు ధర్మకాటాలో తూకం వేసి చూసుకున్నారు. రైతుబజార్ ఈవో చినబాబు, సహాయకుడు సూర్యనారాయణ పాల్గొన్నారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. ఉదయం 7.30 గంటలకు బాల భోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. సాయంత్రం వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

రైతుబజార్ స్టాళ్లకు డ్రా

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లోని స్టాళ్లకు శుక్రవారం డ్రా తీశారు. ఉదయం, సాయంత్రం బజార్ల రైతులకు ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు స్టాళ్లకు సంబంధించిన టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఈవో మట్లాడుతూ రైతులు వారికి కేటాయించిన స్టాళ్లలో వ్యాపారం చేయాలని సూచించారు.

మద్యం సీసాలు స్వాధీనం

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా మద్యం విక్రయించడానికి తీసుకెళ్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించి ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం బాపూజీనగర్‌కు చెందిన వారణాసి భువనేశ్వరరావు అనే వ్యక్తి ఊర్వశి కూడలి నుంచి ఆరు (180 ఎంఎల్) మద్యం సీసాలను అక్రమంగా తీసుకెళ్తున్న క్రమంలో బాపూజీనగర్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో ఉమెన్ ఎస్ఐ దివ్యభారతి కేసు దర్యాప్తు చేపట్టారు.

విస్తృతంగా పోలీసుల తనిఖీలు



అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్డులో కారు తనిఖీ చేస్తున్న ఎస్ఐ వెంకటరావు



సీతమ్మధార అల్లూరి జంక్షన్‌లో తనిఖీలు చేస్తున్న రెవెన్యూ ఆఫీసర్ పైడిరాజు, పోలీసులు

సీతమ్మధార: కొద్ది రోజుల్లో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఉత్తర నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, డిప్యూటీ కలెక్టర్ డి.అఖిల ఆదేశాల మేరకు నగరంలో పలుచోట్ల చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేశారు. సీతమ్మధార అల్లూరి సీతారామరాజు జంక్షన్‌లోని అవుట్ పోస్ట్ వద్ద శుక్రవారం ఉదయం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. కార్లు, ఆటోలు ఇలా అనుమానం వచ్చిన ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, ప్రయాణ వివరాలు డ్రైవర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రతి వాహనం నంబర్ రాసుకున్నారు. స్పెషల్ ఫోర్స్ పోలీసులు, లా అండ్ ఆర్డర్ ఏఎస్ఐతోపాటు పది మంది సిబ్బంది తనిఖీలు చేస్తున్నారు. స్టాటిక్ సేవలర్-1, జీవీఎంసీ జోన్-3, రెవెన్యూ ఆఫీసర్ కె.పైడిరాజు, ద్వారకా పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ జె.సురేష్‌కుమార్, వీడియోగ్రాఫర్ టి.కృష్ణారావు విధులు నిర్వహించారు.

ఫోర్త్‌టౌన్ పీఎస్ పరిధిలో..

ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్డు, తాటిచెట్లపాలెం, నేషనల్ హైవేపై ఎస్ఐ వెంకటరావు, కేంద్ర పోలీస్ బలగాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు, జీపులు మొదలగు వాహనాలను ఆపి క్షుణ్ణంగా పరిశీలించి, వాహనాల నంబర్, వాహనదారుడి పేరు నమోదు చేసుకున్నారు.

ప్రతి వాహనం తనిఖీ..

డైమండ్ పార్కు వద్ద శుక్రవారం ఉదయం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. కార్లు, ఆటోలను క్షుణ్ణంగా పరిశీలించి.. ఎక్కడి నుంచి వస్తున్నారు.. ఎక్కడికి వెళ్తున్నారని వాహన చోదకులను ప్రశ్నించారు. ప్రతి వాహనం నంబర్ రాసుకున్నారు. స్పెషల్ ఫోర్స్ పోలీసులు, లా అండ్ ఆర్డర్ ఏఎస్ఐతో పాటు సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు.

15.5 కిలోల గంజాయి పట్టివేత

తాటిచెట్లపాలెం: గంజాయి తరలిస్తున్న ఒడిశా వాసిని విశాఖ రైల్వేస్టేషన్‌లో గవర్నమెంట్ రైల్వే పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ శ్రీనివాసరావు, ఆర్పీఎఫ్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ అనంత్‌రావు సిబ్బందితో కలిసి స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లాకు చెందిన సాహిల్ సింగ్ బ్యాగులను తనిఖీ చేయగా.. అందులో 15.5 కిలోల గంజాయి గుర్తించారు. గంజాయిని స్వాధీనం చేసుకుని.. నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అపోలో ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, కార్యదర్శి పి.చెల్వరాజు ఒక ప్రకటనలో తెలిపారు. బీపీ, సుగర్, నాడీ, మూర్ఛ వ్యాధి సమస్యలు, మూత్ర సంబంధ వ్యాధులకు సంబంధించిన వైద్య నిపుణులు పరీక్షలు చేస్తారన్నారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వైద్య శిబిరం జరుగుతుందని చెప్పారు.

నేను ప్రజాశాంతి పార్టీలోనే ఉన్నా..

- సినీ నటుడు బాబు మోహన్

సీతమ్మధార: తాను ప్రజా శాంతి పార్టీలోనే ఉన్నానని, బీఆర్ఎస్ టిక్కెట్ వచ్చి పార్టీ మారిపోయినట్లు తప్పుడు ప్రచారం జరుగుతోందని ప్రజా శాంతి పార్టీ నాయకుడు, వరంగల్ ఎంపీ అభ్యర్థి, సినీ నటుడు బాబు మోహన్ స్పష్టం చేశారు. ఆశీలమెట్టలోని కేఏ పాల్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. వరంగల్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, తాను తెల్ల కాగితం వంటివాడినని పేర్కొన్నారు. ఆ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పనిచేస్తున్న తనను విశాఖ ఎంపీగా గెలిపించాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలో నూతన 132 కేవీ హెచ్‌టీ టవర్ ఏర్పాటు, కండక్టర్ మార్పుల్లో భాగంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు సంజీవయ్య కాలనీ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సీతమ్మధార సబ్ డివిజన్ పరిధిలో..

సీతమ్మధార: ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్, సీతమ్మధార సబ్ డివిజన్ 11 కేవీ పీ అండ్ టీ కాలనీ ఫీడర్ పరిధిలో సత్యం జంక్షన్ నుంచి సీతమ్మధార అల్లూరి సీతారామరాజు కూడలి వరకు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ స్తంభాలు మార్చుతున్న కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని జోన్-1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు గాంధీనగర్, సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం, పోస్టాఫీస్, దొర హాస్పిటల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

జోన్-2 బర్మాక్యాంప్ పరిధిలో..

కంచరపాలెం: కంచరపాలెం జోన్-2 పరిధి బర్మా క్యాంప్ 33/11 కేవీ ఫీడర్స్ టవర్స్ లైన్స్, తీగల మార్పులు, మరమ్మతులు, చెట్లకొమ్మల తొలగింపు నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఊర్వశి కూడలి జాతీయ రహదారి, పాలిటెక్నిక్ కళాశాల, నలంద నగర్, దేవేంద్రనగర్, ఇంటిలిజెన్స్ కార్యాలయ పరిధి, అశోక్‌నగర్, గంగన్ననగర్, జోగారావునగర్, తిక్కవానిపాలెం, ధర్మానగర్, రవీంద్రనగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలు



కె.కె.రాజును ఆశీర్వదిస్తున్న పాస్టర్లు



గుడ్ ఫ్రైడే ఆరాధనలో పాల్గొన్న క్రైస్తవులు..



గుడ్ ఫ్రైడే సందేశమిస్తున్న సిస్టర్ షైలాపాల్

తాటిచెట్లపాలెం: గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రైల్వే న్యూకాలనీలోని లైఫ్ చేంజింగ్ రివైవల్ సెంటర్ వ్యవస్థాపకుడు పి.జె.స్టీఫెన్‌పాల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నగరంలోని గురజాడ కళాక్షేత్రంలో ఘనంగా గుడ్ ఫ్రైడే ప్రార్థనలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగిన ఆరాధనల్లో పి.జె.స్టీఫెన్‌పాల్, షైలాపాల్‌లు దైవసందేశాన్ని ప్రత్యక్షంగా, వర్చువల్‌గా అందించారు. గుడ్ ఫ్రైడే ప్రాముఖ్యాన్ని, మానవాళి పాపాల విమోచనే నిమిత్తం ఏసుక్రీస్తు చేసిన త్యాగాన్ని వివరించారు. ప్రార్థనల అనంతరం విశ్వాసులందరికీ అల్పాహారం అందజేశారు. నగరం నలుమూలల నుంచి క్రైస్తవులు పాల్గొన్నారు.

గుడ్ ఫ్రైడే ప్రార్థనల్లో కె.కె.రాజు


సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు శ్రీనివాసనగర్‌లోని జీసస్ హోలీ స్పిరిట్ ఫైర్ మినిస్ట్రీస్‌లో డాక్టర్ కె.ఎ.డానియల్ గుడ్ ఫ్రైడే ప్రార్థనలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు, ఎన్నికల పరిశీలకుడు బాణాల శ్రీనివాసరావుతో కలిసి పాల్గొన్నారు. పాస్టర్లు కె.కె. రాజును ఆశీర్వదించారు.

పులకించిన రక్షణగిరి


కంచరపాలెం: సర్వ మానవాళి పాప విమోచన కోసం ఏసు ప్రాణత్యాగం చేసిన రోజే గుడ్ ఫ్రైడే అని విశాఖ ఆర్చి బిషప్ రెవరెండ్ ఫాదర్ మల్లవరపు ప్రకాశ్ అన్నారు. జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయంలో విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ నేతృత్వంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రైస్తవులతో రక్షణగిరి కిటకిటలాడింది. ఏసు నామాన్ని జపిస్తూ, త్యాగాన్ని కీర్తిస్తూ, సర్వజన రక్షణ కోరుతూ కన్నీటితో ప్రార్థనలు చేశారు. శిలువ యాత్రకు జనం పోటెత్తారు. రక్షణ సభ గురువులు, పీపీసీ సభ్యుల సంయుక్త ఆధ్వర్యంలో విశాఖ ఆర్చి బిషప్ ఫాదర్ మల్లవరపు ప్రకాశ్, రెవరెండ్ ఫాదర్లు శిలువను మోసుకుంటూ వేలాది మంది క్రైస్తవులతో కలిసి రక్షణగిరిపైకి చేరుకున్నారు. క్రీస్తు మరణం, శిలువ మార్గం-క్రీస్తు వేదన, శ్రమలను సూచిస్తూ ఏర్పాటు చేసిన 14 స్థలాల వద్ద ప్రార్థిస్తూ ప్రదక్షిణ చేశారు. ఫాదర్ జాన్‌ప్రకాష్ గుడ్ ఫ్రైడే సందేశాన్ని అందించారు. ప్రధాన దేవాలయం వద్ద బైబిల్ పఠనం, దివ్యపూజ బలులు, సామూహిక ప్రార్థనలు చేశారు. సాయంత్రం 5 గంటలకు ఉపవాస దీక్షాపరులు రక్షణగిరిపై దీక్ష విరమించారు. కార్యక్రమంలో ఫాదర్లు వేళంగిణిరాజు, ప్రభాకర్, ప్యారిస్ పాస్టిల్ కౌన్సిల్(పీపీసీ) అధ్యక్షుడు శ్రీముసురు రాజేష్‌బాబు, పాలమరెట్టి ఫ్రాన్సిస్, మీసాల స్వర్ణలత, వేల సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శిలువ రూపకం

మురళీనగర్: స్థానిక సెయింట్ సేవియర్ ఆర్‌సీఎం చర్చిలో మురళీనగర్, మాధవధార పరిసర ప్రాంతాలకు చెందిన క్రైస్తవులు గుడ్ ఫ్రైడే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫాదర్ రాజశేఖర్ బైబిల్‌లోని క్రీస్తు శాంతి సందేశం వినిపించారు. ఏసును శిలువ వేసిన వృత్తాంతాన్ని వివరిస్తూ ప్రదర్శించిన రూపకం ఆకట్టుకుంది.



రక్షణగిరిపై సందేశమిస్తున్న రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్



మురళీనగర్ చర్చిలో క్రీస్తుకు శిలువ వేసిన రూపకం

ముస్లింలకు ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు



మసీద్‌లో నమాజ్ ఆచరిస్తున్న ముస్లింలు

మర్రిపాలెం: మాధవధారకు చెందిన విటెక్ వాటర్ సొల్యూషన్స్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 53వ వార్డు జాకీర్ హుస్సేన్‌నగర్ మస్జీద్-ఏ-అల్ ఖదీర్ ప్రాంగణంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.

ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలతోపాటు ముస్లిం మహిళలకు వివిధ రకాల ఆహార పదార్థాలు, పండ్లు పంపిణీ చేశారు. ప్రత్యేకంగా తయారు చేసిన పానీయాన్ని ముస్లింలకు అందజేశారు. కార్యక్రమాన్ని సంస్థ అధినేత షేక్ మదీనా వలీ పర్యవేక్షించారు.

జుమ్మా నమాజ్ ఆచరించిన ముస్లింలు

రంజాన్ ఉపవాస దీక్షలను పురస్కరించుకుని మూడో శుక్రవారం ముస్లింలు పెద్ద ఎత్తున ప్రార్థనలు చేశారు. 53వ వార్డు జాకీర్ హుస్సేన్‌నగర్ మస్జీద్-ఏ-అల్ ఖదీర్ వద్ద ఆయా పరిసర ప్రాంతంలో ఉన్న ముస్లింలు జుమ్మా నమాజ్‌ను ఆచరించారు. హాఫీజ్(మత గురువు) ఖురాన్, తఖ్రీర్ పఠించి ఖురాన్‌లోని సూక్తులను వివరించారు. సాయంత్రం మగ్రిబ్ నమాజ్‌కు ముందు దీక్షను విరమించారు. కార్యక్రమాన్ని మసీద్ అధ్యక్షుడు మున్నా పర్యవేక్షించారు.

కేవీల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం

తాటిచెట్లపాలెం: కేంద్రీయ విద్యాలయాల్లో బాలవాటిక, మొదటి తరగతి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైనట్లు వాల్తేర్ కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ కమల్ జీత్ ఒక ప్రకటనలో తెలిపారు. బాలవాటిక, మొదటి తరగతి ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో వచ్చేనెల 1 నుంచి 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థుల మొదటి జాబితా ఏప్రిల్ 19న, మిగిలి ఉంటే రెండో జాబితా 29న, ఇంకా సీట్లు మిగిలి ఉంటే మే 8న ప్రకటిస్తామని తెలిపారు. 2 నుంచి 9వ తరగతి వరకు ఖాళీ సీట్ల భర్తీకి ఆఫ్‌లైన్‌లో వచ్చేనెల ఒకటి నుంచి 10 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నామన్నారు. తుది జాబితా 15న ప్రకటించనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు కేంద్రీయ విద్యాలయ సంఘటన్ వెబ్‌సైట్ http://kvsanghatan.nic.in/admission/లో చూడాలని కోరారు.

ఇష్టారాజ్యంగా వాహనాల రాకపోకలు



ఆశీలమెట్ట సిగ్నల్ పాయింట్ మధ్యలో నిలిపివేసిన స్కార్పియో కారు

సీతమ్మధార: నగరం నడిబొడ్డున ఉన్న ఆశీలమెట్ట సిగ్నల్ జంక్షన్‌లో వాహన చోదకులు ఇష్టారాజ్యంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఇక్కడ ట్రాఫిక్ పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. శుక్రవారం ఉదయం 11.30 గంటల సమయంలో ఆశీలమెట్ట జంక్షన్‌లోని రోడ్డు సెంటర్‌లో సిగ్నల్ పడకముందే స్కార్పియో కారును నిలిపివేయడంతో ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఆ సమయంలో ఒక్క ట్రాఫిక్ కానిస్టేబుల్ కూడా కనిపించకపోవడం విశేషం. జీవీఎంసీ గాంధీ విగ్రహం వైపు నుంచి రామాటాకీస్‌కు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ పోలీస్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, ఇటువంటివి పునరావృతం కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.